సమస్యల పరిష్కారానికి..బస్తీబాట

2 నుంచి సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తలసాని పర్యటన

బేగంపేట్ డిసెంబర్ 30: జనవరి 2 నుంచి సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బస్తీలు, కాలనీల్లో పర్యటించనున్నట్టు మాజీ మంత్రి ,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్‌లలో గల బస్తీలు, కాలనీలలో పర్యటించి చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలను కూడా తెలుసుకుంటామని వివరించారు. బస్తీలు, కాలనీల పర్యటనలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

హిమాయత్‌నగర్‌లోని ప్రజా కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మిగౌడ్

బోయిగూడలో దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు

ముమ్మరంగా దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తు ఫారాలు అందక ప్రజల ఇబ్బందులు

బంజారాహిల్స్/హిమాయత్‌నగర్/బన్సీలాల్‌పేట్,డిసెంబర్ 30: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జీహెచ్ఎంసీ సర్కిల్-18 పరిధిలో మూడో రోజు కొనసాగింది. వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, షేక్‌పేట డివిజన్ల పరిధిలోని 16 ప్రజాపాలన కేంద్రాల్లో అభయ హస్తం పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. రెండు రోజులుగా దరఖాస్తుల కొరతతో ఇబ్బందులు పడిన జనానికి శనివారం ఊరట లభించింది. అన్ని కేంద్రాల్లో దరఖాస్తు ఫారమ్స్ అందుబాటులో ఉంచడంతో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సాఫీగా సాగింది. తొలి రెండు రోజులతో పోలిస్తే మూడో రోజున జనం కూడా కొంతమేర తక్కువగానే కనిపించారు. ప్రజాపాలన కేంద్రాల వద్ద జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం కల్పించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని సింగాడకుంటలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్‌ను కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని సింగాడకుంటలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

హిమాయత్‌నగర్ పరిధిలో..

విఠల్‌వాడి, శంషీర్‌బాగ్, గాంధీకుటీర్, సంజయ్‌గాంధీ నగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మహాలక్ష్మిపథకం, ఇందిరమ్మ ఇండ్లు,రేషన్‌కార్డుల కోసం అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్,బీఆర్ఎస్ నేత జి.రామన్ గౌడ్ డివిజన్‌లోని కేంద్రాలను సందర్శించారు.

దరఖాస్తు ఫారాలు పంపిణీ..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఐదు గ్యారంటీల పథకాల కోసం దరఖాస్తు ఫారాల కొరత తలెత్తడంతో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు పలు బస్తీలలో దరఖాస్తు ఫారాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 60లోని శ్రేష్ఠ స్కూల్‌లో శనివారం 'ఆడాప్ట్' పేరుతో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన చిన్నారుల్లోని నైపుణ్యత, సృజనాత్మకు అద్దం పట్టింది. వాతావరణ కాలుష్యం, బ్యాంకింగ్ మోసాలు, పవన విద్యుత్, సౌరవిద్యుత్, చంద్రయాన్-3 తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ కిరణ్‌బాబు బహుమతులు అందజేశారు.
- బంజారాహిల్స్,డిసెంబర్ 30:

మైనార్టీలపై దాడులను సహించం

ఖైరతాబాద్, డిసెంబర్ 30: దేశంలో మైనార్టీలపై దాడులు చేస్తే సహించమని తెలంగాణ క్రిస్టియన్ ముస్లిం జేఏసీ చైర్మన్ అజయ్ మద్దిశెట్టి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. క్రైస్తవులు, ముస్లింలు ఏకమై.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలో నగరంలో లక్ష మందితో భారీ సభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్, భారత్ బచావో జాతీయ నేత డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, కుమార్ మాదిగ, జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట రీల్స్ చేశాడు... కటకటాల పాలయ్యాడు

వంశీకృష్ణ (నిందితుడు)

బేగంపేట్ డిసెంబర్ 30: ఓ యువకుడు ఏకంగా పోలీస్‌స్టేషన్ ముందే సిగరేట్ తాగుతూ రీల్స్ చేశాడు. చేసిన రీల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు ఆ యువకుడిపై పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట్ పాటిగడ్డ ఎంబీటీ నగర్‌కు చెందిన వంశీకృష్ణ (25) ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చెడు అలవాట్లకు అలవాటు పడ్డాడు. ఈ నెల 17న మినిస్టర్ రోడ్డులోని రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ ముందు సిగరేట్ తాగుతూ ఆకతాయి రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఆ రీల్స్ పోలీసుల కంట పడింది. దీంతో వంశీకృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. వంశీకృష్ణకు న్యాయమూర్తి 8 రోజుల జైల్ శిక్ష విధించారు.

పాతకక్షలతో బీర్‌బాటిల్‌తో దాడి

హత్యాయత్నం కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబర్ 30: పాతకక్షలతో వ్యక్తిపై బీర్ బాటిల్‌తో కడుపులో పొడిచిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వైజాగ్‌కు చెందిన గొప్పు శ్రవణ్ కుమార్ (33) సినిమా షూటింగ్స్‌లో పనిచేస్తూ కృష్ణానగర్‌లోని షీతల్ లాడ్జిలో ఉంటున్నాడు. రెండునెలల క్రితం బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో రూ.5 భోజనం కౌంటర్ వద్ద కొంతమంది వ్యక్తులు గొడవపడుతుంటే శ్రవణ్‌కుమార్ అడ్డుకున్నాడు. కాగా ఆ గొడవలో తాను దెబ్బలు తినడానికి కారణమైన శ్రవణ్‌కుమార్‌ను అంతుచూస్తానంటూ ఓ వ్యక్తి హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఇందిరానగర్‌లోని మంగా టిఫిన్స్ వద్ద టిఫిన్ చేసేందుకువచ్చిన శ్రవణ్‌కుమార్‌ను గుర్తుతెలియని వ్యక్తి బీర్‌బాటిల్‌తో కడుపులో పొడిచాడు. గాయపడిన శ్రవణ్‌కుమార్ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

బంజారాహిల్స్,డిసెంబర్ 30: మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో యువకుడిపై దాడి జరిగిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్11లోని సింగాడకుంట ధోబీఘాట్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఖాజా అనే యువకుడు తన స్నేహితులు పర్వా ప్రసాద్, వంశీ, మహేష్, సాయి తదితరులతో కలిసి బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13లోని శ్మశాన వాటికలో శుక్రవారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. మద్యం మత్తులో మాటామాట పెరగడంతో పరస్పరం దాడులకు దిగారు. ఈ దాడిలో తనను కొట్టడంతో గాయాలపాలయ్యానని బాధితుడు ఖాజా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐపీసీ 341,323 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా నక్కా శ్రీనివాస్‌గౌడ్

అమీర్‌పేట్ : అమీర్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నక్కా శ్రీనివాస్‌గౌడ్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్‌కు అడ్వైజరీ ప్యానెల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ ప్రాంతీయ అధికారి షిఫాలీకుమార్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.